

ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి

శికామసుందరీదేవిగా రాజశ్యామల

- రెండోరోజు పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు
- స్వరూపానందేంద్రతో కలిసి యాగశాల చుట్టూ ప్రదక్షిణ
- నేడు పూర్ణాహుతికి ముహూర్తం

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శ్రేయస్సు కోసం సీఎం కేసీఆర్ చేపట్టిన రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం శాస్త్రోక్తంగా కొనసాగుతున్నది. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రమంతా రాజశ్యామల అమ్మవారి మూల మంత్రాలతో మార్మోగుతున్నది. గురువారం రెండోరోజు యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శికామసుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి అవతారానికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములు ప్రత్యేక హారతులు ఇచ్చారు. సీఎం కేసీఆర్ దంపతులు రాజశ్యామల యంత్రానికి, సుబ్రహ్మణ్య షడావరణ యంత్రానికి పూజలు చేశారు. పండితులు 11సార్లు శూలినీ దుర్గ కవచ పారాయణం చేశారు. సర్వలోక సంరక్షణార్థం ఇంద్ర సూక్త హోమం, నవగ్రహ సూక్త హోమం కూడా నిర్వహించారు. షడావరణ సహిత మూల మంత్రాలతో సుబ్రహ్మణ్య కవచ యాగం చేపట్టారు. ఉదయాన్నే యాగశాలకు చేరుకున్న కేసీఆర్ దంపతులు.. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలతో కలిసి యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వరూపానందేంద్ర స్వామి స్వహస్తాలతో సాగిన రాజశ్యామల చంద్రమౌళీశ్వరుల నిత్య పీఠార్చనకు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ యజుర్వేద పండితులు ఘనస్వస్తి పలికారు. యాగం ఏర్పాట్లను ఎంపీ సంతోష్‌కుమార్ పర్యవేక్షిస్తుండగా, కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. యాగం శుక్రవారంతో ముగుస్తుంది. ఉదయం 11.10 గంటలకు పూర్ణాహుతికి ముహూర్తం నిర్ణయించారు. యాగంలో 3 లక్షలకుపైగా రాజశ్యామల అమ్మవారి మూలమంత్రాలను హవనం చేస్తున్నారు. యాగంలో తెలంగాణతో పాటు తమిళనాడు, ఏపీ, కర్ణాటకకు చెందిన 170 మంది పండితులు పాల్గొంటున్నారు. అటు.. శతచండీ యాగంలో భాగంగా రెండోరోజు గణపతి పూజ, గోపూజ, యాగశాల పరిక్రమణం, చండికాపరమేశ్వరీ నవావరణ పూజ, శత సప్తశతి పారాయణములు, లక్ష నవాక్షరీ మంత్ర జపము, లక్ష్మీనారాయణ హృదయ యాగం, త్రైలోక్యమోహనగౌరీ మూల మంత్రానుష్ఠానము చతుర్వేద పారాయణములు మహా మంగళ హారతీ, సువాసినీ కన్యకాపూజ మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు.

..తెలంగాణ ముద్దపప్పు రేవంత్

మొదటిపేజీ తరువాయి...

కరువును తరిమికొట్టే వరం, తెలంగాణ జాతి సంపద కాళేశ్వరం ప్రాజెక్టు అని తెలిపారు. మానకొండూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు మంత్రి కేటీఆర్ సమక్షంలో గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దున్నపోతు ఈనిందంటే దూడను గాట్ల కట్టేయమన్నట్టుగా కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ నేతలు రాహుల్, రేవంత్ వ్యవహారశైలి ఉన్నదని ఎద్దేవా చేశారు. రెండు పప్పులు కలిసి బ్రిడ్జి మీద ఉన్న ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ను చూపిస్తూ కాళేశ్వరం కూలిపోతున్నదని చెప్పుకొన్నారని ధ్వజమెత్తారు. ఏ బ్రిడ్జి కట్టినా మధ్యలో గ్యాప్ ఉంటుందన్న కనీసం పరిజ్ఞానం కూడా వారికి లేదని ఎద్దేవా చేశారు. ఇద్దరు మహా ఇంజినీర్లు, సన్నాసులు పోయి కాళేశ్వరం కూలిపోయిందంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరంలోని చిన్న లోపాలను పెద్దగా చూపించి.. బరాజ్ కొట్టుకపోయిందనటం వారి భావదారిద్ర్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని రాహుల్‌గాంధీ మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నదని ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక బాగుపడ్డది ఒక్క గాంధీ కుటుంబమేనని అన్నారు. రాహుల్‌గాంధీ స్క్రిప్ట్ రైటర్‌ను అయినా మార్చుకోవాలి, లేదా స్క్రిప్ట్ అయినా మార్చుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ వల్లే తెలంగాణలో కరువు

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ కరువు కాటకాలతో అల్లాడిపోవటానికి కాంగ్రెస్ పాలనే కారణమని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నీళ్లు ఇచ్చి ఉంటే తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాలు ఎందుకు వచ్చేవని రాహుల్‌గాంధీని నిలదీశారు. రాహుల్‌కు చరిత్ర తెలియదని, తెలుసుకోవాలనే సోయి కూడా లేదని ఎద్దేవా చేశారు. నెహ్రూ మొదలుపెట్టిన ఎస్సారెస్పీ నిర్మాణం నిన్నమొన్నటి దాకా నడుస్తనే ఉన్నదని, ఒక ప్రాజెక్టు కట్టడానికి 60 ఏండ్లు పట్టిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం కేసీఆర్ నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేశారని తెలిపారు. జలయజ్ఞం పేరిట ధనయజ్ఞం చేసిన దౌర్భాగ్యులు కాంగ్రెస్‌వారు కాదా? అని ప్రశ్నించారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ మొదలు పెట్టి మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో వేల కోట్ల నిధులు కాజేశారని దుయ్యబట్టారు. 'రాహుల్ పక్కన ఉన్న రేవంత్‌రెడ్డి దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజ్‌కంటే పెద్ద కిలాడీ. గతంలో ఓటుకు నోటు అమ్ముకున్నాడు. ఇప్పుడు సీటుకు నోటు అమ్ముకున్నాడు. రేపు రాహుల్‌ను అమ్మినా అమ్ముతడు' అని ఎద్దేవా చేశారు.

మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన గడ్డం నాగరాజు

నాడు కాలువలు తప్ప రిజర్వాయర్లు లేవు

కాంగ్రెస్ రూపొందించిన ప్రాణహిత చేవెళ్లలో పంపుహౌస్‌లు, కాలువలు తప్ప రిజర్వాయర్లు లేవని మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ డిజైన్ చేసిన తరువాత అనేక రిజర్వాయర్లు నిర్మించామని తెలిపారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ, మల్కపేట, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లు వచ్చాయని గుర్తుచేశారు. 2005లో ప్రాణహిత చేవెళ్ల అంచనా వ్యయం రూ.40 వేల కోట్లు ఉంటే, 2015 తరువాత రిజర్వాయర్లతో కలిసి రూ.80 వేల కోట్లకు చేరిందని, రూ.80 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటున్న రాహుల్‌ను పప్పు అనకపోతే ఏమంటరని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు రాహుల్‌గాంధీని పప్పు అని ఎద్దేవాచేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాళేశ్వరం లేకుంటే తెలంగాణ రాష్ట్రం పంజాబ్, హర్యానాను దాటి వరి ఎట్లా పండిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి తిమింగళమని, ఏ టు జడ్ కుంభకోణాలు చేసింది ఆ పార్టీయేనని ఆరోపించారు.

కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు ఇంత మందా?

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ నేతలంతా తరలివస్తున్నారని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎంపీకి ఉన్నవి కూలగొట్టడం, శవాలున్నాయా? శివాలున్నాయా? అనటం తప్ప మరేమీ తెలియదన్నారు. ఈ ఎన్నికల్లో ఖర్చుచేసేందుకు కాంగ్రెస్‌వారికి కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వస్తున్నాయని విమర్శించారు. ఒక్క కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు మోదీ, అమిత్‌షా, 16 మంది బీజేపీ సీఎంలు, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక సీఎం సిద్దరామయ్య తదితరులంతా వస్తరట అన్నారు. కాంగ్రెస్ లాంటి సన్నాసుల చేతిలో తెలంగాణను పెడితే మరో 50 ఏండ్లు వెనక్కి పోతామని హెచ్చరించారు. బీఆర్ఎస్‌లో చేరిన నాగరాజు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రాబోతున్నదని చెప్పారు. కార్యక్రమంలో కరీంనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ వేణు, టీఎస్ పుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, దరువు ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నారం బరాజ్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

'సీపేజ్'పై అప్రమత్తత భేష్

- సకాలంలో ట్రీట్‌మెంట్ చేశారు
- సీడబ్ల్యూసీ డైరెక్టర్ల బృందం ప్రశంస
- అన్నారం బరాజ్ పరిశీలన

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం (సరస్వతి) బరాజ్‌ను సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) డైరెక్టర్ల బృందం గురువారం సాయంత్రం పరిశీలించింది. సోషల్ మీడియాలో అన్నారం బరాజ్‌పై జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో సీడబ్ల్యూసీ, రాష్ట్ర బృందం అన్నారం బరాజ్ గేట్లను పరిశీలించింది. వాటికి ఎలాంటి సమస్యా లేదని పేర్కొంది. 28, 38వ గేట్ల సమీపంలో చిన్న చిన్న సీపేజ్‌లు ఏర్పడినట్టు గుర్తించిన అధికారులు.. వాటితో పెద్ద ప్రమాదం లేదని తేల్చారు. బుధవారం చిన్న చిన్న సీపేజ్‌లు ఏర్పడగానే ఇరిగేషన్ అధికారుల బృందం స్టోన్, మెటల్, ఇసుకతో ట్రీట్‌మెంట్ చేసింది. అధికారులు తీసుకున్న నిర్ణయాలను సీడబ్ల్యూసీ బృందం ప్రశంసించినట్టు అన్నారం బరాజ్ ఈఈ యాదగిరి తెలిపారు. సీపేజ్‌ల ద్వారా స్వల్పంగా నీరు తప్పితే ఇసుక బయటకు వెళ్లదు కాబట్టి ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. కాంక్రీట్ డ్యాంలలో సైతం సీపేజ్‌లు ఏర్పడతాయని, ఇవి సాధారణమేనని సీడబ్ల్యూసీ బృందం పేర్కొన్నట్టు తెలిసింది. కాకపోతే అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అనంతరం రాష్ట్ర ఇరిగేషన్ అధికారులతో సీడబ్ల్యూసీ బృందం సమావేశమై అసరమైన సలహాలు, సూచనలు చేసింది. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ డైరెక్టర్లు ఆర్ తంగమణి, రమేశ్‌కుమార్, దేవేందర్‌రావు, ఇరిగేషన్ ఈఎన్‌సీ ఓఅండ్‌ఎం నాగేంద్రరావు, కాళేశ్వరం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అయ్యో రాహులా.. అంత అజ్ఞానమా?

- మేడిగడ్డపై ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ను చూపి పగులుగా చిత్రీకరించిన రాహుల్ అండ్ కో
- సోషల్ మీడియాలో రాహుల్‌ను ఆడుకొంటున్న నెటిజన్లు
- పగులుకు, ఎక్స్‌పాన్షన్ జాయింట్‌కు తేడా తెలియని సన్నాసి అంటూ ఎద్దేవా
- రాహుల్‌ను అమూల్ బేబీతో పోల్చుతూ సెటైర్లు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉన్నది కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీరు. మేడిగడ్డ బరాజ్‌కు ఏదో జరిగిపోయిందంటూ పెడబొబ్బలు పెడుతూ దాన్ని పరిశీలించేందుకు వెళ్లిన ఆయన... చివరికి దానిపై ఉండే ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ను చూసి పగుళ్లు ఏర్పడినట్టు భ్రమపడ్డారు. అంతటితో ఆగకుండా తన తెలివితక్కువ తనాన్ని ప్రపంచానికి కూడా తెలియజేసేందుకు అక్కడ దిగిన ఫొటోలను తన ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేసి బరాజ్ పిల్లర్లకు పగుళ్లు వచ్చాయని పచ్చి అబద్ధాలను రాసుకొచ్చారు. దీంతో ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు రాహుల్‌గాంధీపై దుమ్మెత్తి పోస్తున్నారు. పగుళ్లకు, ఎక్స్‌పాన్షన్ జాయింట్‌కు తేడా తెలియని సన్నాసి రాహుల్ అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ముందు అవి పగుళ్లు (క్రాక్) కాదని, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో సాధారణంగా కనిపించే ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ అని తెలుసుకో అంటూ చురకలంటిస్తున్నారు. 'అందుకే రాహుల్... నిన్ను పప్పు అనేది' అంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ చిత్రాలను షేర్ చేస్తూ 'ఇవే నువ్వు చూపించిన పగుళ్లు' అని రాహుల్‌పై సెటైర్లు వేస్తున్నారు. ఇక రాహుల్‌గాంధీని గతంలో రేవంత్‌రెడ్డి 'రాహుల్ గాంధీ పప్పు కాదు.. ముద్ద పప్పు' అన్న వ్యాఖ్యల్ని జోడించి... నిజమే! రేవంత్‌రెడ్డి చెప్పినట్టు రాహుల్‌గాంధీ పప్పు కాదు.. ముద్ద పప్పు అనేది తేలిపోయిందంటూ కామెంట్లు చేస్తున్నారు. రేవంత్‌రెడ్డిని కూడా ఓ ఆటాడుకున్నారు. రాహుల్‌గాంధీ పోస్ట్ చేసిన ఫొటోలో ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ను రేవంత్‌రెడ్డి చూపుతున్నట్టుగా ఉన్నది. దీంతో మరోసారి రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీని బక్రా చేశాడు. పప్పును చేశాడు అంటూ సెటైర్లు వేస్తున్నారు.

పావుగంట కోసం ఇంత పరుగా?

బరాజ్ సందర్శన పేరుతో తెగ హడావిడి చేసిన రాహుల్‌గాంధీ బ్యాచ్.. అక్కడి అలా వచ్చి రెండు ఫొటోలు తీసుకొని ఇలా వెళ్లిపోయారు. హఠాత్తుగా రాత్రికి రాత్రే మేడిగడ్డ పర్యటన ఖరారు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టును చూసేందుకు అంబట్‌పల్లిలో మహిళా సదస్సు పేరిట కొత్త నాటకమాడారు. ఈ సాకుతో పార్టీ నాయకులను, కార్యకర్తలను అంబట్‌పల్లికి తరలించారు. ఉదయం 8:15కు మేడిగడ్డ ప్రాజెక్టు వద్దకు హెలికాప్టర్‌లో చేరుకున్న రాహుల్‌గాంధీ, నేరుగా కారులో అంబట్‌పల్లి మహిళా సదస్సుకు చేరుకొని, 15 నిమిషాల్లో ప్రసంగం ముగించి మళ్లీ మేడిగడ్డ ప్రాజెక్టు వద్దకు వెళ్లి రేవంత్‌రెడ్డితో కలిసి ఫొటో దిగి వెళ్లిపోయారు. సదస్సు పావుగంటలో పూర్తవటంతో అసలు మమ్మల్ని ఎందుకు పిలిచారు? ఈ మీటింగ్ ఎందుకు పెట్టారు? అని మహిళలు మండిపడుతూ వెళ్లడం కనిపించింది.

అసలేంటీ ఎక్స్‌పాన్షన్ జాయింట్

ప్రతి బ్రిడ్జి, ఫ్లైఓవర్, సీసీ రోడ్ల నిర్మాణంలో తప్పనిసరిగా ఈ ఎక్స్‌పాన్షన్ జాయింట్స్‌ను వదులుతారు. ఇందుకు కారణం ఆ బ్రిడ్జి లేదా ఫ్లైఓవర్ ఉష్ణోగ్రతల సమతుల్యతను తట్టుకొనేందుకు, పొడవును సరి చేసేందుకు, బ్రిడ్జి భాగాలను అనుసంధానం చేసేందుకు దీన్ని ఏర్పాటు చేస్తారు. అందుకే బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల మధ్యమధ్యలో ఈ జాయింట్స్ కనిపిస్తాయి. ఈ జాయింట్స్ లేకుండా బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల నిర్మాణం చేయలేరు. ఒకవేళ చేసినా అవి నిలబడవు. ఈ విషయం కూడా తెలియకుండా రాహుల్‌గాంధీ ఎక్స్‌పాన్షన్ జాయింట్స్ వద్ద ఫొటో దిగి దాన్నే పగులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

మేడిగడ్డ బరాజ్‌పైన ఉన్న ఎక్స్‌పాన్షన్ జాయింట్‌ను క్రాక్ అని చూపిస్తున్న రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి

నేడు బీఆర్ఎస్‌లోకి కాసాని జ్ఞానేశ్వర్

- సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బీఆర్ఎస్‌లో చేరనున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు సీఎం కేసీఆర్ సమక్షంలో కండువా కప్పుకోనున్నారు. తెలంగాణ ఎన్నికల్లో తెలుగు దేశం పోటీ చేయవద్దని చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాసాని ఆ పార్టీ అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. తెలుగుదేశం పార్టీ ఉండగా.. ఉన్న పార్టీని కాదని మరొక పార్టీని ఎన్నికల్లో గెలిపించాలనే లక్ష్యంతో చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడికి లేఖ కూడా రాశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అయితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే ఉద్దేశంతో బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ముదిరాజ్ సామాజిక వర్గంలో పట్టున్న నేతగా కాసాని జ్ఞానేశ్వర్‌కు గుర్తింపు ఉన్నది.

ఐఏఎస్ఎస్ఐ వార్షిక సదస్సులో పాల్గొన్న రామకృష్ణారావు తదితరులు

మహిళాభ్యున్నతిలో తెలంగాణ ఆదర్శం

- రాష్ట్ర ఆర్థికశాఖ ఎస్సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): మహిళాభ్యున్నతిలో తెలంగాణ దేశానికి ఆదర్శమని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. గురువారం హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)లో నిర్వహించిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ సైన్స్ ఇన్‌స్టిట్యూషన్స్(ఐఏఎస్ఎస్ఐ) 22వ వార్షిక సదస్సులో రామకృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు ఆదర్శంగా ఉన్నదని ప్రశంసించారు. పదేండ్లలో స్వయం సహాయక సంఘాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ రేవతి, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసెర్చ్ సెక్రటరీ ధనంజయ్ సింగ్, ప్రొఫెసర్లు ఎస్ మహేంద్రదేవ్, సచిన్ చతుర్వేది, దీపక్ నయ్యర్ తదితరులు పాల్గొన్నారు.